క్లుప్తంగా

పరిసరాల శుభ్రత పాటించాలి



కొనకొండ్లలో వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

వజ్రకరూరు: మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో బుధవారం వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ పద్మావతి మాట్లాడుతూ.. ఏడు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరుగుతుందన్నారు. 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు టీకాలు వేస్తామని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాబావలి, ఏఎన్ఎం భవ్య, ఎంఎల్‌హెచ్‌పీలు శ్రావణి, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

వజ్రకరూరు: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గురువారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేస్తామని ఈఓఆర్డీ సదాశివ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 7,340 మంది లబ్ధిదారులకు వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

బ్రహ్మసముద్రం : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. బాలికలు , మహిళల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకువచ్చిన దిశ యాప్ సేవలు , వినియోగాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ పరుశురాముడు, ప్రిన్సిపాల్ సత్యవతమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పండ్ల మొక్కలకు దరఖాస్తు చేసుకోండి

కుందుర్పి: స్థానిక కుసుమగిరి పరస్పర రైతు ఉత్పత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా పండ మొక్కలను పంపిణీ చేయనున్నట్లు ఆ సంఘం మండల కోఆర్డినేటర్ నరశింహమూర్తి తెలిపారు. పండ్ల మొక్కలు అవసరమైన రైతులు స్థానిక కుసుమగిరి రైతు సంఘం కార్యాలయంలో ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కంబదూరు ఎస్ఐగా ఆంజనేయులు



కంబదూరు: మండల నూతన ఎస్ఐగా ఆంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ యువరాజ్ సీఐగా పదోన్నతిపై కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ ఆంజనేయులు ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. అతకుముందు నూతన ఎస్ఐకు సిబ్బంది, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

కుష్టు వ్యాధిని అరికడదాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి

ఉరవకొండ: శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ నాయక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాకెట్ల తండాలో కుష్టు వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. కుష్టును బహుళ ఔషధ చికిత్స ద్వారా నయం చేయవచ్చని పేర్కొన్నారు. అనంతరం కుష్టు నివారణకు కృషి చేస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ, ఎంపీహెచ్ఎస్ శేఖర్, సీఓ భగవాన్‌దాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ

బొమ్మనహాళ్: మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాలాజీ, యూటీఎఫ్ శాఖ మండల గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జాతర కోలాహలం



విరుపాపల్లిలో మారెమ్మ, కొల్లాపురమ్మ దేవతలకు పూజలు చేస్తున్న అర్చకుడు



జాతరకు తరలివచ్చిన జనం



కణేకల్లు: పూజల్లో పాల్గొన్న మెట్టు, ఎమ్మెల్యే శంకరనారాయణ తదితరులు

కణేకల్లు: మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో బుధవారం ఊరిదేవర ఘనంగా జరిగింది. తొమ్మిదేళ్ల తర్వాత దేవర నిర్వహించడంతో ప్రతి ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది. బంధువులు, స్నేహితులను విందుకు ఆహ్వానించడంతో గ్రామం కిక్కిరిసిపోయింది. రెండు రోజుల నుంచి దేవమ్మ, దుర్గమ్మ గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసిన గ్రామస్తులు మంగళవారం అర్ధరాత్రి ఆలయాల ముందు దేవరపోతును బలిచ్చారు. ప్రజలు గ్రామదేవతలకు పూజలు చేసి మొక్కులను తీర్చుకొన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఎమ్మెల్యే, అనంతపురం పార్లమెంటు సమన్వయకర్త శంకరనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొని ఉపేంద్రరెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు భీమిరెడ్డి అమ్మవారికి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండేలా చూడాలని వేడుకొన్నారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు భీమప్ప, హళ్లి నాగరాజు, వెంకటేశులు ఇళ్లకెళ్లి వారితోపాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. నేతలకు స్థానికులు శాలువ కప్పి, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పీఏసీఎస్ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, మార్కెట్‌యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, మండల అగ్రిబోర్డు చైర్మన్ ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, సర్పంచు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మారెన్న, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు కళేకుర్తి జయరామిరెడ్డి, ఆదిగానిపల్లి వెంకటేశులు, యంత్రకాయల వన్నూరప్ప, హళ్లి సురేష్, పాటిల్ వెంకటరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడే సందడి..

బొమ్మనహాళ్: మండల పరిధిలోని విరుపాపల్లి, గంగవరం, బూదవర్తి గ్రామాల్లో బుధవారం జాతరను ఘనంగా జరుపుకున్నారు. విరుపాపల్లిలో మారెమ్మ, కొల్లాపురమ్మ జాతర, గంగవరంలో మారెమ్మ జాతర, బూదివర్తిలో దుర్గమ్మ జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. జాతరలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో సందడి నెలకొంది. ఎస్ఐ శివ, ఏఎస్ఐ దేవదాసు సిబ్బందితో కలిసి బందోబస్తు చేపట్టారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు



మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: పట్టణంలో తాగునీటికి కొరత లేకుండా చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. బుధవారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, బండి అజయ్, శ్రీనివాసరెడ్డి, పద్మజ మాట్లాడుతూ ప్రణాళిక మేరకు మూడు రోజులకోసారి నీటి సరఫరాలో సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. కౌన్సిలర్ బండి అజయ్ మాట్లాడుతూ పని ప్రాధాన్యతను, సాధ్యాలను గుర్తించి మరో కౌన్సిల్‌లో తీర్మానించాలని, ప్రస్తుతానికి వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. జీరో అవర్‌లో పలువురు కౌన్సిలర్లు నీటి ఎద్దడిపై ఆందోళన వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ శిల్ప మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ పెండింగ్ పనులు లేకుండా చూస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్పను అగౌరవపరిచే విధంగా జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆమెకు రక్షణ కల్పించాలని కోరుతూ సీఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ తట్టే మంజునాథ మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులతో సమష్టిగా సమస్యలపై చర్చించి ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వలిబాషా, శ్రీనివాస యాదవ్, ఇన్‌చార్జ్ కమిషనర్ సురేష్, హౌసింగ్ ఏఈ జయచంద్ర, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగదీష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పేదల మేలుకోరే సీఎం వైఎస్ జగన్



క్యాంపును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: పేదల మేలు కోరే గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం పట్టణంలోని 11,12 వార్డు ప్రజలకు భంభంస్వామి లేఅవుట్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంపును కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప ప్రారంభించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ దీర్ఘకాలిక జబ్బులు, ఖరీదైన జబ్బుల వారిని ఆరోగ్యశ్రీ కింద సిఫార్సు చేసి మేలు చేసేలా కార్యక్రమం జరుగుతోందన్నారు. ఉచితంగా మందులు, పరీక్షలు సైతం చేస్తూ మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, శారదమ్మ, శ్రీలక్ష్మీ, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, గౌని శ్రీరామిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి రక్ష

బొమ్మనహాళ్: ప్రజారోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రక్ష అని వైద్యాధికారులు కుమారరాజా, గీతా భార్గవి అన్నారు. బుధవారం మండలంలోని లింగదహాళ్ గ్రామంలో ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆరోగ్య రక్షణ కల్పించడమే ఆరోగ్య సురక్ష పథకం లక్ష్యమన్నారు. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ విజయమ్మ, ఎంపీహెచ్ఈఓ శివప్రసాద్, విజయభారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ బాలాజీ, గౌతమి, ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, ఎర్రమ్మ, రత్రమ్మ, ఈశ్వరమ్మ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం విజయవంతం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రఘురామమూర్తి

రాయదుర్గం రూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 7 రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం విజయవంతమైందని ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అన్నారు. మండలంలోని బీఎన్ హళ్లి గ్రామంలో యూనిట్- 1 ప్రోగ్రాం అధికారి దొడ్డ నాగప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి సర్పంచ్ గొల్ల చంద్రకళ, వైఎస్సార్ సీపీ నాయకుడు రామాంజినేయులు, గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిదని ఆయన కొనియాడారు. శిబిరం ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాల, ఓవర్ హెడ్ ట్యాంకు, పరిసరాల పరిశుభ్రత, కంపమొక్కలు తొలగించుట, బురద మట్టిని తొలగించుట, చెత్తా చెదారాన్ని తీసివేయడం లాంటి కార్యక్రమాలు విద్యార్థులు చేపట్టారన్నారు. సర్పంచ్ చంద్రకళ భర్త రామాంజినేయులు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నారాయణ, రామకృష్ణ, అధ్యాపకులు రవికుమార్, కిరణ్, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం నాగరాజు, భువనేశ్వర్ , పంచాయితీ కార్యదర్శి శోభ, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

విజయవంతంగా 'హైరిస్క్' కాన్పులు



బాలింతలతో గైనకాలజిస్ట్ మాధవి, సర్జన్ మున్వర్‌రాజ్

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం రెండు హై రిస్క్ కేసుల్లో విజయవంతంగా కాన్పులు పూర్తి చేశారు. గైనకాలజిస్ట్ పరిగి మాధవి, జనరల్ సర్జన్ మున్వర్‌రాజ్, అనస్తీషియా వైద్యుడు సలాం ఆపరేషన్లలో పాలుపంచుకున్నారు. దాదాపు 20 ఏళ్ల తరువాత ఆస్పత్రిలో సిజేరియన్ ఆపరేషన్లు జరగడం గమనార్హం. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన రూతమ్మ మొదటి కాన్పులో ఆడబిడ్డకు జన్మనివ్వగా, బ్రహ్మసముద్రం మండలం బుడేమేపల్లికి చెందిన పాలాక్షి మొదటి కాన్పులో మగబిడ్డకు జన్మనిచ్చింది.

ప్రజల హర్షం..

గతంలో వైద్యుల కొరత కారణంగా ఇతర ప్రాంతాలకు హైరిస్క్ కేసులను రెఫర్ చేసేవారు. అయితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులు, సిబ్బందిని పూర్తి స్థాయిలో ఆస్పత్రిలో నియమించారు. అవసరమైన సౌకర్యాలు కూడా సమకూర్చారు. గతంలో గైనకాలజిస్ట్ తోపాటు అనస్తీషియా సౌకర్యం ఉండేది కాదు. ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఆస్పత్రిలో రెండు నెలల నుంచి గైనకాలజిస్ట్ మాధవి, సర్జన్‌లు మెర్సీ సుధ, మున్వర్‌రాజ్‌లు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను సవాలుగా తీసుకుని చేపడుతున్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే పేదలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చిన్న పాటి ఆపరేషన్లు, అవసరమైన పక్షంలో సిజేరియన్ ఆపరేషన్‌లకు ఇతర ప్రాంతాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితుల్లో స్థానికంగానే సమస్య పరిష్కారమవుతుండడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ప్రభుత్వాస్పత్రుల పట్ల నమ్మకం కలిగించిన సీఎం వైఎస్ జగన్‌కు పేదలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తగ్గిన పప్పుశనగ దిగుబడి



గొటుకూరులో పంటకోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్లానింగ్ అధికారి అశోక్ కుమార్

కూడేరు: రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ వర్షాభావంతో దిగుబడి తగ్గినట్లు జిల్లా ప్లానింగ్ అధికారి అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గొటుకూరు వద్ద సాగు చేసిన పప్పుశనగలో పంటకోత ప్రయోగాలు చేపట్టారు. సర్వే నంబర్ 292లో పెద్ద అనంతయ్య అనే రైతు సాగు చేసిన పప్పుశనగలో పంటకోత ప్రయోగాలను వ్యవసాయాధికారులు చేపట్టారు. కేవలం 650 గ్రాములు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రయోగాన్ని జిల్లా ప్లానింగ్ అధికారి అశోక్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సకాలంలో కురిస్తే ఎకరాకు 8-10 క్వింటాళ్ల వరకూ పప్పుశనగ దిగుబడి వస్తుందన్నారు. కానీ ప్రస్తుతం ఎకరాకు ఒక క్వింటాలోపే వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ కుమార్, ఏఎస్ఓ ఆశా, వీహెచ్ఏ పుల్లప్ప, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.84,728 రికవరీకి ఆదేశం

బొమ్మనహాళ్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన ఎంపీడీఓ రామచంద్ర, ఎస్ఆర్‌పీ లోకేష్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2022-23లో 19 గ్రామ పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్, హౌసింగ్ కింద చేపట్టిన 1,386 పనులకు రూ.7,44,26,009 నిధులు ఖర్చు చేశారు. గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు 15 రోజులుగా క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. 17 గ్రామ పంచాయతీల్లో రూ.17,728 మొత్తాన్ని జిల్లా అధికారులు రికవరీ చేయాలని ఆదేశించారు. ఇదే విధంగా పనులు చేసినా వాటికి సరైన ఫొటో ధ్రువీకరణ లేని మరో రూ.67,000 విలువైన పనులు ఉన్నట్టు జిల్లా అధికారులు తేల్చి రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, మండల అగ్రీ బోర్డు చైర్మన్ శ్రీనివాస్, ఎంపీటీసీ శకుంతలాబాయి, డ్వామా ఏపీడీ సుదాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అంబుడ్స్‌మెన్ మదుసూదన్, ఏపీఓలు కృష్ణమూర్తి, బాగ్యలక్ష్మి, స్వాతి, డీఆర్‌పీలు, ఎన్ఆర్ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కుందుర్పి: మండల సర్వసభ్య సమావేశం నేడు (గురువారం) నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంపీపీ కమలమ్మ తెలిపారు. ఉదయం 11 గంటల స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిదులు తప్పక పాల్గొనాలని సూచించారు.

ఘనంగా జాతర

విడపనకల్లు: మండల పరిధిలోని గాజుల మల్లాపురంలో బుధవారం మారెమ్మ దేవి జాతర జరిగింది. తెల్లవారుజాము నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామ ప్రజలు తరలివచ్చి మారెమ్మ తల్లికి పూజలు చేశారు. ఎంపీపీ కరణం పుష్పావతి, నాయకులు భీంరెడ్డి, పోలికి చిన్న వెంకటేశులు, పెద్ద వెంకటేశులు, వివిధ గ్రామాల నాయకులు పూజలు చేయించి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో డిష్ వెంకటేశులు, వన్నారెడ్డి, కావలి వెంకటేశులు, నాగరాజు, సత్తి, ఎర్రిస్వామి రెడ్డి, శంకర్ గౌడు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

బొమ్మనహాళ్: స్థానిక శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. రాయదుర్గం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతికా నవాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలనానరు. అనంతరం ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో ఉత్తమ ప్రతిభతో నియోజకవర్గంలో ద్వితీయస్థానం సాధించిన పాఠశాల విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుమ, కరస్పాండెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు అప్పిలేపల్లి విద్యార్థులు

కుందుర్పి: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో భాగంగా అప్పిలేపల్లి సచివాలయ పరిధిలోని విద్యార్థులు ఖోఖోలో జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, వ్యాయామ ఉపాధ్యాయురాలు నళిని తెలిపారు. గురువారం జిల్లా స్థాయిలో నిర్వహించే ఖోఖో పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారన్నారు. నియోజకవర్గస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను సర్పంచ్ అతావుల్లా, ఎంపీటీసీ కెంచమ్మ అభినందించారు.

రేపు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

గుమ్మఘట్ట: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు రమేష్, బాలాజి నాయక్, సీహెచ్ఓ మురళీధర్ తెలిపారు. ఉచిత వైద్యశిబిరంలో నిపుణులైన వైద్యులు నాణ్యమైన వైద్యసేవలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'హౌసింగ్'పై సమీక్ష

రాయదుర్గం: నియోజకవర్గంలోని 5 మండలాల హౌసింగ్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్టు ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. అర్హత ఉండి ఇంటి స్థలం పొందని వారు, ఇల్లు కట్టుకోలేని వారికి న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పక్కాగా రికార్డుల నిర్వహణ

కూడేరు: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన రికార్డుల్లో వివరాల నమోదు పక్కాగా ఉండాలని డ్వామా ఏపీడీ అనురాధ ఆదేశించారు. బుధవారం ఆమె ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించారు. జీజీఐ పారా మీటర్స్ రికార్డులను తనిఖీ చేశారు. వర్క్‌ఫైల్, 7 రిజిష్టర్స్, జాబ్ కార్డులు, నేమ్ బోర్డుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. తప్పులు లేకుండా రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ అసిస్టెంట్ రవి, ఏపీఓ తులసీ ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల్ని అణచివేస్తాం

గుమ్మఘట్ట: అసాంఘిక శక్తులను అణచివేస్తామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తిరుపతి నుంచి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని వెల్లడించారు. అక్రమమద్యం, పేకాట, ఇసుకను తరలిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. అనంతరం సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

రాయదుర్గం రూరల్: అంకితభావంతో పనిచేస్తేనే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని రాయదుర్గం ఎంపీడీఓగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన టి.కొండయ్యతెలిపారు. ఆయనను ఎంపీపీ విద్యావతి, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఏఓలు నాగమణి, వెంకటరమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

విడపనకల్లు: మండల పరిధిలోని గాజుల మల్లాపురంలో బుధవారం తెల్లవారుజామున నిప్పు అంటుకుని గడ్డివాము దగ్ధమైంది. వైఎస్సార్‌సీపీ నాయకుడు వన్నారెడ్డికి చెందిన పది ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు, వరిగడ్డి వాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయింది. రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కరణం పుష్పావతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కరణం భీంరెడ్డి తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డితో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తామని రైతుకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చిన్న గాజుల చిన్న వెంకటేశులు పెద్ద వెంకటేశులు, స్థానిక నాయకులు కావలి వెంకటేశులు, చంద్రశేఖర్, శంకర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి సేవలు మరువలేనివి



సీహెచ్ఓ వరలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

కూడేరు: విధి నిర్వాహణలో సీహెచ్ఓ వరలక్ష్మి అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా పేర్కొన్నారు. బుధవారం ఉద్యోగ విరమణ చేసిన సీహెచ్ఓను స్థానిక పీహెచ్‌సీలో సన్మానించారు. కార్యక్రమంలో మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్‌పర్సన్ నిర్మలమ్మ, మండల వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, సౌమ్యరెడ్డి, సర్పంచ్ లలితమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, సూపరింటిండెంట్ నాగభూషణ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్ రవీంద్ర,ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులు వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ బదిలీ

గుమ్మఘట్ట: ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న నరసింహామూర్తి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఇన్‌చార్జ్ బాధ్యతలను ఈఓపీఆర్డీ సురేశ్ బాబుకు అప్పగించారు. బుధవారం బదిలీపై వెళుతున్న ఎంపీడీఓను సచివాలయాల సిబ్బంది, కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుమునుపు ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం



అందంగా రూపుదిద్దుకున్న ట్రాన్స్‌కో కార్యాలయ భవనం

కూడేరు: స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్‌కో కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.26 లక్షలు కేటాయించింది. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పైకప్పు దెబ్బతిని, పెచ్చులూడి కింద పడేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఈ నెలలో భవనాన్ని ప్రారంభించనున్నట్లు ట్రాన్స్ కో అధికారులు తెలిపారు.

మోడల్ పేపర్ల పంపిణీ

కంబదూరు: మండలంలోని ములకనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జీవశాస్త్రం మోడల్ పేపర్ బుక్స్‌ను వితరణ చేశారు. వచ్చే పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో మోడల్ పేపర్స్‌ను విద్యార్థులకు ముందుగా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వరప్ప, ఉపాధ్యాయులు చిత్తప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

కళ్యాణదుర్గం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజల ఆరోగ్య భద్రతకు భరోసా లాంటివని డాక్టర్ రిహ జైనం అన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని కురాకులతోట జగనన్న కాలనీ సమీపంలోని వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్‌లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి తరలి వచ్చిన 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రాధారాణి, దామోదర్, నర్సులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల స్వైర విహారం

కుందుర్పి: మండల కేంద్రంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఎస్సీ కాలనీకి చెందిన నాగమ్మ అనే మహిళపై బుధవారం పిచ్చి కుక్కలు దాడిచేయడంతో భాదితురాలు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. కుందుర్పి పరిసర ప్రాంతాల్లో కోళ్ల షెడ్లు అధికంగా ఉండటంతో రోగాలతో చనిపోయిన కోళ్లను షెడ్ల యజమానులు ఎక్కడ పడితే అక్కడ పారవేస్తున్నారు. దీంతో కుక్కలు మృతి చెందిన కోళ్లను తినడంతో అవి పిచ్చి కుక్కలుగా మారాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టి పిచ్చి కుక్కల బారి నుంచి పాదచారులను కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.